గోషామహల్‌లో విద్యుత్ సమస్యలు తీర్చండి

కార్వాన్, అక్టోబర్ 23 : గోషామహల్ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ కోరారు. బేగం బజార్ ఎలక్ట్రికల్ డీఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఫరాత్ అలీని బుధవారం ఆనంద్ కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న దీపావళి పండుగను పురస్కరించుకొని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రియాగుప్తా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పటాకుల దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

అంబర్‌పేట, అక్టోబర్ 23 : దీపావళి పండుగను పురస్కరించుకుని పటాకుల దుకాణం ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. లైసెన్స్ లేకుంటే షాపు నడపడానికి అనుమతి ఇవ్వబడదని పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు షాపులను ఫుట్‌పాత్, జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దని సంబంధిత అధికారులు తెలిపారు. ఓపెన్ గ్రౌండ్, పెద్ద హాల్స్‌లో తగిన ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకొని షాపులను పెట్టుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు రిటైల్ షాప్‌లకి రూ. 11 వేలు, హోల్ సేల్ షాపులకు రూ. 66వేలుగా నిర్ణయించినట్లు అంబర్‌పేట సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత తెలిపారు. లైసెన్స్ విషయమై దుకాణదారులు సహకరించాలన్నారు.

అంబర్‌పేటను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, అక్టోబర్ 23 : అంబర్‌పేట నియోజకవర్గాన్ని వంద శాతం క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. బుధవారం అంబర్‌పేట డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే చెత్త రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కేవలం చెత్తను తరలించడమే కాకుండా వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత, కార్పొరేటర్లు విజయ్‌కుమార్ గౌడ్, బి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక డివిజన్‌లో..

గోల్నాక డివిజన్‌లో బుధవారం జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు కొత్తగా మంజూరైన చెత్త రిక్షాలను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యాశ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. రహదారులపై చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని ఆమె ఈ సందర్భంగా కార్మికులకు సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : కార్పొరేటర్

కాచిగూడ : వ్యాధులు ప్రబలకుండా ప్రతి వీధి, బస్తీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ ప్రజలకు సూచించారు. బుధవారం నింబోలి అడ్డా కార్యాలయంలో జీహెచ్ఎంసీ కార్మికులకు 8 చెత్తరిక్షాలను కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటికి వచ్చే చెత్తరిక్షాలలో వేసి శుభ్రతను పాటించాలన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి చెత్త రిక్షాలు ఎంతగానో దొహదపడతాయన్నారు. స్వచ్ఛ హైదరాబాద్‌తో నగర రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. కార్మికుల ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, తిరుపతినాయక్, అమరేశ్వరి, విష్ణు, రామారావు, దేవా, చంద్రశేఖర్, మల్లికార్జున్, మహేశ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రఘు, దశరథ, కృష్ణ, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో పారిశుధ్య కార్మికులకు చెత్త రిక్షాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాకలో పారిశుధ్య కార్మికులకు చెత్త రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్యాశ్రీనివాస్‌గౌడ్

కార్మికులకు చెత్త రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్, తదితరులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, మాజిద్ హుస్సేన్



నానల్‌నగర్ డివిజన్‌లో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, సర్కిల్ -13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ నసీరుద్దీన్

మెహిదీపట్నం అక్టోబర్ 23 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ సర్కిల్-13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో కలిసి 21 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో...

నాంపల్లి నియోజకవర్గం అహ్మద్‌నగర్ డివిజన్ మాసాబ్‌ట్యాంక్ చాచా నెహ్రూ పార్కు వద్ద ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి 21 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ఈకార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మాసాబ్‌ట్యాంక్ చాచానెహ్రూ పార్కు సమీపంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తదితరులు

కుంగిన నాలా.. కుప్పకూలిన రోడ్డు

● గోషామహల్ చాక్నావాడి ప్రధాన రహదారిపై ఘటన

చాక్నావాడిలో నాలా వద్ద స్థానికులతో మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్

కార్వాన్, అక్టోబర్ 23 : గోషామహల్ దారుస్సలాం-చాక్నావాడి ప్రధాన రహదారి కింద నాలా బుధవారం తెల్లవారుజామున కుంగిపోయింది. నాలా కూలిపోయిన సమయంలో జన సంచారం, వాహనాలు రాకపోవడంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా నాలా కూలిన విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బంది చాక్నావాడికి చేరుకొని నాలా కూలిన రోడ్డును మూసేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రాజాసింగ్

చాక్నావాడిలో నాలా కూలిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే టి. రాజాసింగ్ సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ కన్వీనర్ క్రిష్ణ, బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తమరావు, సురేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ప్రేరణ' నృత్య రూపకం

రవీంద్రభారతి, అక్టోబర్ 23 : వరంగల్‌కు చెందిన కళాకారులు గజ్జల రంజిత్‌కుమార్, నవ్యజల బృందం పేరిణి నాట్యాన్ని మేళవించి ప్రదర్శించిన 'ప్రేరణ' నృత్య రూపకం ఆహూతులను ఆలోచింపజేసింది. బుధవారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో ప్రేరణ నృత్య రూపకం ప్రదర్శించారు. వివిధ పాత్రలతో అద్భుతమైన సన్నివేశాలతో సుమధుర సంగీతంతో కాకతీయుల కళా స్ఫూర్తితో ప్రారంభమైన నృత్య రూపకం నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టింది. 40 మంది కళాకారులతో కొనసాగిన ఈ ప్రదర్శన మైమరిపించింది. వరంగల్ ఎంపీ కడియం కావ్య, సంగీత నాటక అకాడమీ చైర్మన్ పుంజాల అలేఖ్య, భాషాసాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అవార్డు గ్రహీత డాక్టర్ కళా కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు.

గోల్కొండలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి..

గోల్కొండలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్ సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కలిసి ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఏసీపీకి సూచించారు.

– మెహిదీపట్నం, అక్టోబర్ 23

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

కారును తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాస్

కాచిగూడ,అక్టోబర్ 23: ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడలో కార్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అధిక సౌండ్ కలిగిన వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించి, కార్లలో అంటించిన బ్లాక్ స్టిక్కర్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. ఫోర్‌వీలర్ వాహనాలకు పరిమితికి మించి సౌండ్ ఉండకూడదని, అధిక సౌండ్ చట్టరీత్యా నేరమని అన్నారు. నిబంధనలను పాటించని వాహన దారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నజియా కుటుంబసభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, అక్టోబర్ 23 : అంబర్‌పేట డివిజన్ రహత్ నగర్‌కు చెందిన నజియా అనారోగ్యంతో ఇటీవల ఓ ప్రైవేటు దవాఖానాలో చేరి శస్త్ర చికిత్స చేయించుకుంది. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 60 వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును బుధవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. పేదలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

నేటి నుంచి ఫార్మా ఇండియా ఎక్స్‌పో

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నేటి నుంచి 26వ తేదీ వరకు ఫార్మా ఇండియా ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ సీఈవో స్వదేశీ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్లను జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, శాస్త్రవేత్త దుంద్ర కుమారస్వామి, జెనిసిస్ ఇన్ఫార్మేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ వినయ్, క్లినిసాల్ సంస్థ సీఈవో సీఎస్ ముజీబుద్దీన్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎన్.కె. శేగల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ ఎక్స్‌పో ఫార్మా రంగంలో వస్తున్న ఆధునిక పోకడలు, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 30 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్వీపర్ మృతి

కాచిగూడ, అక్టోబర్ 23: రోడ్డు ప్రమాదంలో స్వీపర్ మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. గోల్నాక డివిజన్‌లోని హర్రాస్‌పెంట ప్రాంతానికి చెందిన కొట్టయ్య కుమారుడు సాయి మల్లు (70) శ్మశానవాటికలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో శ్మశానవాటికకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్/సీనియర్ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్/జర్మన్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి, బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 6వ తేదీ నుంచి, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ జవాబు పత్రాల నకలుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మూడో రోజు ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్

కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయం పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 23 : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూడో రోజు ప్రశాంతంగా జరిగింది. బుధవారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు నిర్ణీత సమయంలోపే చేరుకున్నారు. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐలు మధుసూదనాచారి, అంకం నరేశ్ తమ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా మూడో రోజు కోఠి మహిళా వర్సిటీలో వింగ్ -ఏలో 792 మంది అభ్యర్థులకుగాను 728 మంది పరీక్ష రాయగా 64 మంది గైర్హాజరయ్యారు. వింగ్-బీలో 864 మంది అభ్యర్థులకు గాను 779 మంది పరీక్ష రాయగా 85 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా వివేక్ వర్ధిని కళాశాలలో 528 మంది అభ్యర్థులకుగాను 447 మంది పరీక్ష రాయగా 81 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

● దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు జ్ఞాపికను అందజేస్తున్న కాండూరి క్రిష్ణమాచారి తదితరులు

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 23 : దేవాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తన కళా నైపుణ్యంతో గీసిన మంత్రి కొండా సురేఖ చిత్రపటాన్ని ఆయన సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో కొండా సురేఖకు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా క్రిష్ణమాచారి మాట్లాడుతూ.. మంత్రిగా బాధ్యతలను చేపట్టిన అనతికాలంలోనే అర్చక, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం హర్షణీయమని అన్నారు. ఇందుకోసం కృషి చేసిన దేవాదాయశాఖ కమిషనర్ హనుమంత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా త్వరలోనే కమిషనర్, ఉన్నతాధికారులు, అర్చక, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చక సంఘం కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

బాణాసంచా విక్రయదారుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ బి. బాలస్వామి

గోల్నాక, అక్టోబర్ 23 : బాణాసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఈస్ట్ జోన్ డీసీపీ బి. బాలస్వామి అన్నారు. బుధవారం అంబర్‌పేట మహారాణా ఫంక్షన్ హాల్‌లో బాణసంచా వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బాణాసంచా షాపుల యజమానులు పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన అనుమతులు, జాగ్రత్త చర్యలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతోపాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : రాష్ట్రంలో గుర్తింపు లేని విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆలైడ్ హెల్త్ కేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వంశీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు హెల్త్ సైన్సెస్ విద్యాసంస్థల యాజమాన్యాలు అనుమతులు, గుర్తింపు లేకున్నా విద్యార్థులను చేర్చుకొని వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ఇప్పటికే హైదరాబాద్ వ్యాప్తంగా పది విద్యాసంస్థలను గుర్తించామని, అలాంటి వాటితో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు.

పరుగు పందెంలో గోల్కొండ-1 విద్యార్థికి సిల్వర్ మెడల్

కేంద్రీయ విద్యాలయాల జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ పోటీల్లో కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్‌లోని కేంద్రీయ విద్యాలయ-1 విద్యార్థి రాజ్‌వీర్ గుర్జార్ సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. తిరువనంతపురంలో జరిగిన కేంద్రీయ విద్యాలయాల 53వ క్రీడా పోటీల్లో 800 మీటర్ల విభాగంలో రాజ్‌వీర్ గుర్జార్ సిల్వర్ మెడల్ సాధించాడు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్ సురేశ్ కటోచ్ అభినందించారు.

– మెహిదీపట్నం అక్టోబర్ 23

మూసీ బాధితులకు అండగా 25న ధర్నా

కాచిగూడ, అక్టోబర్ 23: మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం అక్కడ నివసిస్తున్న పేదలను ఇబ్బందులకు గురిచేస్తుందని హైదరాబాద్ సెంట్రల్ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. బుధవారం బర్కత్‌పురా బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు నమ్మడం లేదన్నారు. మూసీ బాధితులకు అండగా ఉండేందుకు నగర బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 9 గంటలకు ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు.